సాక్షి యాదాద్రి భువనగిరి

ఆదివారం : 27 : ఆగస్టు : 2023



బాబోయ్.. దొంగలు !
కోదాడ పట్టణ పరిధిలోని వివిధ వార్డుల్లో వరుసగా జరుగుతున్న దొంగతనాలతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు.
- 8లో



30 ఏళ్లుగా గుడిసెలోనే..
ఆసరా పింఛన్‌నే ఆధారంగా దివ్యాంగులైన ఓ తల్లీకుమారుడు 30 ఏళ్లుగా గుడిసెలోనే నివాసముంటున్నారు.
- 8లో



సంప్రదాయ పూజలు
యాదాద్రి పుణ్యక్షేత్రంలో శనివారం నిత్యారాధనలు సంప్రదాయబద్ధంగా కొనసాగాయి.
- 10లో

న్యూస్‌రీల్

మొక్కలతోనే మానవ మనుగడ



మైసిరెడ్డిపల్లిలో మొక్క నాటుతున్న జెడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి

బొమ్మలరామారం: మానవ మనుగడకు మొక్కలే ఆధారమని జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి అన్నారు. బొమ్మలరామారం మండలంలోని మైసిరెడ్డిపల్లిలో శనివారం మొక్కలు నాటి మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. నాటిన మొక్కలను బాధ్యతగా సంరక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చిమ్ముల సుధీర్‌రెడ్డి, ఎంపీడీఓ సరిత, ఎంపీఓ మాలిని, ఎంపీటీసీ ఫక్కీరు రాజేందర్‌రెడ్డి, సర్పంచ్ రమాదేవి రాంరెడ్డి, పంచాయతీ కార్యదర్శి కుషంగల భాను, ఉపాధిహామీ, అటవీశాఖల సిబ్బంది పాల్గొన్నారు.

చేనేత మహాసభలను జయప్రదం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న చేనేత కార్మికులు

భువనగిరి(వలిగొండ): నల్లగొండలో సెప్టెంబర్ 4,5 తేదీల్లో నిర్వహించనున్న తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ద్వితీయ మహాసభలకు చేనేత కార్మికులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుండు వెంకటనర్సు పిలుపు నిచ్చారు. శనివారం వలిగొండలో చేనేత సంఘం నాయకులతో కలిసి మహాసభల కరపత్రాన్ని ఆవిష్కరించారు. చేతనే కార్మికులు తమ సమస్యలై సంవత్సారాలుగా ఆందోళనలు చేస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. మహాసభల్లో భవిష్యత్ కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గరుదాసు నర్సింహ, దొంత శంకరయ్య, బోడ ఈశ్వర్, సబ్బం రమేష్, ముడుదుడ్ల శేకర్, నర్మద, వెంకటేశం, జ్యోతి, సౌజన్య, గొట్టి ముక్కుల వెంకటేశం, కిరణ్, బొడ సౌజన్య, సంజీవ పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయం తనిఖీ



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈఓ

భువనగిరి : పట్టణంలోని కేంద్రీయ విద్యాలయాన్ని శనివారం డీఈఓ నారాయణరెడ్డి తనిఖీ చేశారు. మూత్రశాలలు, మరుగుదొడ్లతో పాటు రిజిస్టర్లను పరిశీలించారు. నూతన భవన నిర్మాణ పనులను చూశారు. త్వరగా పూర్తి చేసుకొని నూతన భవనంలోకి వెళ్లాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం పహాడీనగర్‌లోని ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. తొలిమెట్టు కార్యక్రమం కోసం అందజేసిన కరదీపికల ద్వారా విద్యార్థులతో సాధన చేయించాలని సూచించారు. విద్యార్థులు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందజేయాలన్నారు. ఆయన వెంట హెచ్‌ఎం షాజీదాకౌసర్, ఉపాధ్యాయులు ఉన్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడల్లో రాణించాలి

భువనగిరి : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని డీఈఓ నారాయణరెడ్డి అన్నారు. ఈశ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 15వ క్రీడోత్సవాల్లో భాగంగా శనివారం భువనగిరిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జిల్లాస్థాయి క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు.ఈశ ఫౌండేషన్ గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. జిల్లా యువజన క్రీడల అభివృద్ధి అధికారి ధనుంజయ్య మాట్లాడుతూ జిల్లా స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులు అక్టోబర్‌లో తమిళనాడులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. అనంతరం జిల్లాస్థాయిలో రాణించిన క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో వలంటీర్ సుచిత్ర, పవన్, భార్గవ్, ఇందు, శ్రీదేవి, జ్యోతి, రమణ, యశోద, ప్రిన్సిపల్ పాపిరెడ్డి, స్టాలిన్‌బాబు, పీఈటీలు రఘువీర్ సింగ్, వెంకటరమణ, పూల నాగయ్య, మల్లేష్ పాల్గొన్నారు.

ఆధునిక వసతులు.. అత్యుత్తమ సేవలు





బీబీనగర్ ఎయిమ్స్‌లో కిక్కిరిసిన అవుట్ పేషెంట్‌లు, చికిత్స పొందుతున్న మహిళ

ఎయిమ్స్‌లో సూపర్ స్పెషాలిటీ వైద్యం
- పది రూపాయలకే ఏడాదంతా..
- పెరుగుతున్న రోగులు
- రోజూ 1,600 వరకు ఓపీ నమోదు
- సేవలను విస్తరించేందుకు చర్యలు

సాక్షి, యాదాద్రి : జిల్లావాసులు సూపర్ స్పెషాలిటీ వైద్యం కోసం హైదరాబాద్ వెళ్లవలసిన బాధలు తప్పుతున్నాయి. బీబీనగర్ ఎయిమ్స్‌లో ఆధునిక సౌకర్యాలతో కూడిన అత్యుత్తమ సేవలు నానాటికీ విస్తరిస్తున్నాయి. నామమాత్రపు ఫీజుతో సూపర్ స్పెషాలిటీ వైద్యం అందుతుండడంతో యాదాద్రి భువనగిరితో పాటు పొరుగు జిల్లాల నుంచి సైతం పేషెంట్లు పెద్ద సంఖ్యలో ఇక్కడికి వస్తున్నారు. రోజూ 1,600 వరకు ఓపీ నమోదవుతుండగా 92 మందికి పైగా ఇన్‌పేషెంట్ సేవలు అందుతున్నాయి. సేవలను మరింత విస్తరించేందుకు ఎయిమ్స్ డైరెక్టర్ డాక్టర్ వికాస్ భాటియా పర్యవేక్షణలో ఏర్పాట్లు జరుగుతున్నాయి.

నామమాత్రపు ఫీజుతో వైద్యం

2020 జూన్ 2వ తేదీన 50 పడకల సామర్థ్యంతో ఎయిమ్స్‌ను ప్రారంభించారు. 2021 డిసెంబర్‌లో 100 పడకలతో ఇన్‌పేషెంట్ సేవలు అందుబాటులోకి తీసుకువచ్చారు. కేవలం రూ.10కే ఓపీడీ సేవలు అందిస్తున్నారు. ఒకసారి ఎంట్రీ చేసుకున్న రోగికి ఏడాది పాటు సేవలు అందుతాయి. అలాగే వివిధ రకాల వైద్య పరీక్షలు, ఎక్స్‌రేలు, నామ మాత్రపు ఫీజుతో చేస్తున్నారు. వీటితో పాటు జనరల్ మెడిసిన్, గైనకాలజీ, ఆర్థోపెడిక్, అప్తామాలజీ, న్యూరాలజీ, కార్డియాలజీ, నెఫ్రాలజీ, ఈఎన్‌టీ, డెర్మటాలజీ, రేడియాలజీ వంటి సూపర్ స్పెషాలిటీ సేవలు అందుతున్నాయి. ఎమర్జెన్సీ కేసులకు సైతం ఇక్కడే వైద్యం చేస్తున్నారు. డయోగ్నస్టిక్, బ్లడ్‌బ్యాంక్, ఫార్మసీ సేవలు అందిస్తున్నారు.

పొరుగు జిల్లాల నుంచి ఎయిమ్స్‌కే..

ఉమ్మడి నల్లగొండ, వరంగల్, మెదక్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, హైదరాబాద్ జిల్లాతో పాటు ఆంధ్రప్రదేశ్ నుంచి సైతం రోగులు బీబీనగర్ ఎయిమ్స్‌కు వస్తున్నారు. రోజురోజుకూ రోగులు పెరుగుతుండడంతో సేవలను మరింత విస్తరించేందుకు ఎయిమ్స్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా భవనాలను నిర్మిస్తున్నారు. ప్రస్తుతం నిమ్స్ భవనాల్లోనే ఎయిమ్స్ కొనసాగుతోంది. ప్రస్తుతం రూ.1,365 కోట్ల అంచనా వ్యయంతో 750 పడకల సామర్థ్యంతో సొంత భవనాలు నిర్మిస్తున్నారు. 2024లోపు ఇవన్నీ అందుబాటులోకి రానున్నాయి.

రోజూ 1,600 మంది వస్తున్నారు



బీబీనగర్ ఎయిమ్స్‌కు వచ్చే రోగుల సంఖ్య నానాటికీ గణనీయంగా పెరుగుతోంది. ప్రస్తుతం రోజూ 1,600 వరకు ఔట్ పేషెంట్లు వస్తున్నారు. 92 మందికి ఇన్ పేషెంట్ సేవలు అందిస్తున్నాం. మూడవ థియేటర్ అందుబాటులోకి వచ్చింది. జర్మనీ నుంచి అత్యాధునిక పరిజ్ఞానంతో కూడిన ఎంఆర్ఐ తెప్పించాం. రోగులకు తక్కువ ఫీజుతో ఎంఆర్ఐ సేవలు అందజేస్తున్నాం. అలాగే బొమ్మలరామారంలో ఎయిమ్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రూరల్ హెల్త్ సెంటర్ అభివృద్ధికి సంబంధించి పనులు కొనసాగుతున్నాయి. పట్టణ హెల్త్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నాం.

– డాక్టర్ వికాస్ బాటియా, డైరెక్టర్, బీబీనగర్ ఎయిమ్స్

తక్కువ ఖర్చుతో జబ్బు నయమైంది



మా బాబు మూత్రపిండాల సంబంధిత వ్యాధితో బాధపడుతుండగా ఎన్నో ఆస్పత్రులకు తిప్పాం. లక్షల రూపాయలు ఖర్చు చేశాం. అయినా జబ్బు నయం కాలేదు. చివరికి బీబీనగర్‌లోని ఎయిమ్స్‌కు తీసుకువచ్చాం. కేవలం రూ.5 వేల ఖర్చుతో రోగం నయం చేశారు.

– లావణ్య, వెంకిర్యాల

మంచి వైద్యం చేశారు

నా భార్యకు పదేళ్ల క్రితం గర్భసంచి ఆపరేషన్ అయింది. అప్పట్లో ప్రైవేట్ ఆస్పత్రిలో ఆపరేషన్ చేయించగా ఇన్‌ఫెక్షన్ వచ్చింది. దీంతో తరుచూ అనారోగ్యానికి గురవుతోంది. ఎయిమ్స్‌కు రాగా డాక్టర్లు వైద్యం అందజేశారు. ఇప్పుడు నా భార్య ఏ సమస్య లేకుండా ఉంది.

– యాదగిరి, ఆలేరు

రాష్ట్రంలో పచ్చదనం పెరిగింది



తుక్కాపురంలో హరితహారంలో పాల్గొన్న సందీప్‌కుమార్ సుల్తానియా, ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, జడల అమరేందర్ తదితరులు

- పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానియా

సాక్షి, యాదాద్రి : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం కార్యక్రమం ద్వారా రాష్ట్రంలో 7.7 శాతం పచ్చదనం పెరిగిందని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానియా పేర్కొన్నారు. స్వతంత్ర భారత వజ్రోత్సవాల ముగింపు సందర్భంగా శనివారం రాష్ట్ర వ్యాప్తంగా కోటి మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా భువనగిరి మండలం తుక్కాపూర్‌లో ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి, కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డితో కలిసి ఆయన మొక్కలు నాటి మాట్లాడారు. హరితహారంలో భాగంగా ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 270 కోట్ల మొక్కలు నాటినట్లు తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా ఇటువంటి కార్యక్రమం జరగలేదన్నారు. పల్లెప్రకతి వనాలు, బృహత్ పల్లెప్రకృతి వనాల ఏర్పాటుతో ఎక్కడ చూసినా పచ్చదనం కనిపిస్తుందన్నారు. డంపింగ్ యార్డులు, వైకుంఠధామాలు ఇతర అభివృద్ధి పనులతో గ్రామాల్లో ఎన్నో మార్పులు చోటు చేసుకున్నట్లు తెలిపారు.

కనుచూపు మేరలో పచ్చదనం : ఎమ్మెల్యే

రాష్ట్రంలో ఏ ప్రాంతానికి వెళ్లినా కనుచూపు మేరలో పచ్చదనం కనిపిస్తుందని ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి అన్నారు. 2014కు ముందు ఎక్కడ చూసినా ఎడారిలా ఉండేదని, ఇప్పుడు హరితమయంగా మారిందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ముందు చూపుతో వ్యవహరించి హరితహారం కార్యక్రమం చేపట్టారని, తద్వారా నేడు అడవుల శాతం పెరుగుతుందన్నారు. తెలంగాణ రాష్ట్రం సిద్ధించాక కరెంట్ కష్టాలు తొలగిపోయాయన్నారు.

ఒక్క రోజే నాలుగు లక్షల మొక్కలు : కలెక్టర్

కోటి మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా జిల్లాలో శనివారం ఒక్క రోజే 4 లక్షల మొక్కలు నాటినట్లు తెలిపారు. తుక్కాపూర్‌లో గతంలో పల్లెప్రకతి వనం ఏర్పాటు చేసి 4 వేల మొక్కలు, బృహత్ పల్లె ప్రకృతి వనంలో 30వేల మొక్కలు నాటినట్లు చెప్పారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కోరారు. నాటిన ప్రతి మొక్కనూ రక్షించాలన్నారు. అనంతరం వారు తుక్కాపూర్‌లోని పల్లె ప్రకృతి వనాన్ని సందర్శించారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టరు వీరారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అమరేందర్‌గౌడ్, జిల్లా రైతు సమన్వయ సమితి కన్వీనర్ కొల్లుల అమరేందర్, ఎంపీపీ నరాల నిర్మల, జెడ్పీటీసీ బీరుమల్లయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ రాజేందర్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పవిత్రోత్సవాలకు అంకురార్పణ



యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో శనివారం రాత్రి సంప్రోక్షణతో పవిత్రోత్సవాలకు అంకురార్పణ చేస్తున్న అర్చకులు

సాగులో మెళకువలపై అవగాహన అవసరం

భువనగిరి : సన్న, చిన్నకారు రైతులు వ్యవసాయంలో మెళకువలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ సూచించారు. శనివారం భువనగిరిలోని పశుసంవర్థక శాఖ కార్యాలయ సమావేశ మందిరంలో సెంటర్ ఫర్ బడ్జెట్ గవర్నెన్స్ అండ్ అకౌంటబిలిటీ మరియు తెలంగాణ అగ్రి నెట్‌వర్క్ పీపుల్స్ మానిటరింగ్ కమిటీ ఆధ్వర్యంలో వ్యవసాయం – అనుబంధ రంగాల్లోని సమస్యలపై సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సాగులో అందుబాటులోకి వస్తున్న ఆధునిక పరిజ్ఞానాన్ని రైతులు ఎప్పటికప్పుడు అందిపుచ్చుకోవాలన్నారు. పీపుల్స్ మానిటరింగ్ కమిటీ జాతీయ కన్వీనర్ బీడీఏ సత్యబాబు బోస్ మాట్లాడుతూ వ్యవసాయం, అనుబంధ రంగాలకు బడ్జెట్‌లో నిధుల కేటాయింపు పెరగాలన్నారు. సన్న, చిన్న కారు రైతుల కోసం సబ్సిడీతో కూడిన పథకాలు అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. సురుపంగ శివలింగం అధ్యక్షతన వహించిన ఈ కార్యక్రమంలో సీబీజీఏ ప్రతినిధులు సోమశేఖర్, ఎండీ మౌలానా, శ్రీశైలం, సీడబ్ల్యూసీ సభ్యులు మల్లేశం, సామాజిక ఉద్యమ నాయకులు బట్టు రాంచంద్రయ్య, కొడారి వెంకటేష్, కేవీపీఎస్ నాయకులు అన్నంపట్ల కృష్ణ, సందెల రాజేష్, ఫార్మర్ ప్రోడ్యూస్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు ఎల్లయ్య, శ్రీనివాస్, మల్లేశం, నర్సింహ, పిలుపు సంస్థ ప్రతినిధి అమరేందర్‌రెడ్డి, యాత్ర ప్రతినిధి స్వప్న తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి అనురాధ

నష్టపోయిన రైతులకు న్యాయం

భువనగిరి : కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి నష్టపోయిన రైతులకు న్యాయ సేవా సంస్థ ద్వారా న్యాయ సహకారం పొందవచ్చని ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్రధాన కార్యదర్శి మురళీమోహన్ అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అగ్రి లీగల్ ఎయిడ్ క్లీనిక్‌లో రైతుల చేసుకున్న దరఖాస్తులను ప్రీలిటిగేషన్ ద్వారా పరిశీలించేందుకు శనివారం భువనగిరిలో కోర్టులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భువనగిరి, ఆలేరు, రామన్నపేట కోర్టుల్లో జిల్లా న్యాయ సేవా సంస్థ ద్వారా అగ్రి లీగల్ ఎయిడ్ క్లీనిక్‌లు పని చేస్తున్నాయన్నారు. దేశానికి అన్నం పెట్టే రైతులను మోసం చేయవద్దన్నారు. నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించడంతో పాటు రైతులు పండించిన పంటను అమ్ముకునే విషయంలో అన్యాయం జరగకుండా న్యాయ సేవా అధికార సంస్థ అండగా ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి శ్రీనివాస్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ మమత, ఏఈఓలు అనీల్, నారాయణ, వెంకన్న, పారా లీగల్ వలంటీర్ కొడారి వెంకటేష్, రాంబాయి, శ్రీశైలం, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు

- కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్

సాక్షి,యాదాద్రి : అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు.రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజ్ శనివారం హైదరాబాద్ నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికల ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లాలో చేపడుతున్న కార్యక్రమాలను కలెక్టర్ ప్రధాన ఎన్నికల అధికారికి వివరించారు. అసెంబ్లీ ఎన్నికలకు ఏర్పాట్లు ముమ్మరంగా చేస్తున్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల ధ్రువీకరణ, నూతన ఓటర్ల నమోదు, ఓటు హక్కు వినియోగం, ఈవీఎంలు, వీవీ ప్యాట్లపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు వీరారెడ్డి, భాస్కర్‌రావు, ఆర్డీఓ అమరేందర్, భువనగిరి మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ నాగేశ్వరాచారి పాల్గొన్నారు.

ఓటరు జాబితా పరిశీలన

భువనగిరి : పట్టణంలోని జిల్లా గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన ఓటరు నమోదు కేంద్రాన్ని శనివారం కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి సందర్శించారు. కేంద్రంలో ప్రదర్శించిన ఓటరు జాబితాను పరిశీలించారు.

మోదీ పేరు మార్మోగుతోంది

- రాష్ట్రంలో అధికారంలోకి వస్తాం
- కర్ణాటక రాష్ట్ర బీజేపీ ఎమ్మెల్యే అవినాశ్ యాదవ్



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అవినాశ్ యాదవ్, జిల్లా అధ్యక్షుడు పీవీ శ్యాంసుందర్‌రావు

సాక్షి, యాదాద్రి : ప్రధాని నరేంద్రమోదీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో దేశవ్యాప్తంగా ఆయన పేరు మార్మోగుతోందని కర్ణాటకలోని చించోలి ఎమ్మెల్యే అవినాష్‌యాదవ్ అన్నారు. కేంద్రంలో మళ్లీ అధికారంలోకి వస్తామని, రాష్ట్రంలోనూ విజయం సాధిస్తామన్నారు. శనివారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీవీ శ్యాంసుందర్‌రావుతో కలిసి భువనగిరిలో విలేకర్లతో మాట్లాడారు. బీఆర్‌ఎస్‌తో చీకటి పొత్తు ఉందని ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలు నిజం కాదన్నారు. పొత్తే ఉంటే ఇతర రాష్ట్రాల నుంచి 66 మంది బీజేపీ ఎమ్మెల్యేలు ఇక్కడి వచ్చి కష్టపడవలసిన అవసరం ఎందుకన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో మెజార్టీ సీట్లు కైవసం చేసుకొని అధికారం చేపడుతామని ధీమా వ్యక్తం చేశారు. కవిత కేసుకు సంబంధించి సాక్ష్యాధారాలు ఉంటే తప్పకుండా అరెస్ట్ జరుగుతుందన్నారు. సమావేశంలో రాష్ట్ర కార్యవర్గసభ్యులు పాశం భాస్కర్, పోతంశెట్టి రవీందర్, పడమటి జగన్‌మోహన్‌రెడ్డి, మాయ దశరథ, సీఏరెడ్డి, జనగాం నర్సింహాచారి, ఉమామహేశ్వర్, డీఎల్‌ఏ గౌడ్ పాల్గొన్నారు.

బీజేవైఎం ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

బస్తీమే భోజన్ కార్యక్రమంలో భాగంగా బీజేవైఎం ఆధ్వర్యంలో భువనగిరిలో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కుమ్మరివాడలో ఓబీసీ మోర్చా పట్టణ కార్యదర్శి ఇంట్లో ఎమ్మెల్యే అవినాశ్ యాదవ్ భోజనం చేశారు. అంతకుముందు ఎమ్మెల్యే ప్రవాస్ యోజనలో భాగంగా నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు.

మినీ ట్యాంక్‌బండ్‌కు పగుళ్లు!

- స్వల్ప కాలానికే కుంగిన కట్ట
- రూ.4.21 కోట్లతో పనులు
- నాణ్యతా లోపమే కారణమని విమర్శలు



మోత్కూరు మినీ ట్యాంక్‌బండ్‌పై కుంగిన ప్రాంతం



కట్టపై ఏర్పడిన పగుళ్లు

మోత్కూరు : పట్టణంలోని పెద్దచెరువు మినీట్యాంక్ బండ్‌కు ముప్పు పొంచి ఉంది. బండ్‌పై వేసిన బీటీ రోడ్డు స్వల్ప కాలానికే దెబ్బతిన్నగా ఇటీవల కురిసిన వర్షాలకు కట్ట ఓ చోట కుంగింది. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

రూ.4.21 కోట్లతో పనులు

మిషన్ కాకతీయ రెండవ దశలో ప్రభుత్వం రూ.4.21 కోట్ల వ్యయంతో పెద్ద చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా మార్చింది. 2017 మే 16వ తేదీన అప్పటి భారీ నీటి పారుదల శాఖ మంత్రి హరీష్‌రావు, ద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి మినీ ట్యాంక్ పనులకు శంకుస్థాపన చేశారు. 12 మీటర్ల వెడల్పు, 950 మీటర్ల పొడవునా కట్టపై బీటీ రోడ్డు వేశారు. అలాగే అలుగు వద్ద బ్రిడ్జి, రెండు బతుకమ్మ ఘాట్లు, మూడు విజిటర్స్ వ్యూ పాయింట్లు, కట్టకు ఇరువైపులా ఇనుప పైపులతో రెయిలింగ్, కట్ట లోపలి భాగంలో రివిట్‌మెంట్ తదితర పనులను 2020 ఫిబ్రవరిలో కాంట్రాక్టర్ పూర్తి చేశారు. బీటీ రోడ్డు పనుల్లో భాగంగా నాణ్యత లోపించిందని అప్పట్లో ఆరోపణలు వచ్చినప్పటికీ ఇంజనీరింగ్ అధికారులు పర్యవేక్షించ లేదు. మట్టిని సరిగా రోలింగ్, వాటర్ క్యూరింగ్ చేయలేదు. దీంతో మధ్య వ్యూ పాయింట్ వద్ద కట్టకు ఉత్తరం వైపున బీటీ రోడ్డుపై రెండు చోట్ల పెద్ద రంధ్రాలు, అలుగు బ్రిడ్జి సమీపంలో భారీ గుంతలు ఏర్పడ్డాయి.

వాహనాలు కూరుకుపోయే ప్రమాదం

బీటీ రోడ్డు దెబ్బతినడమే కాకుండా ఇటీవల కురిసిన వర్షాలకు ఉత్తరం వైపు బీటీ రోడ్డు కుంగిపోయింది. వర్షాలు కురిస్తే ఈ ప్రాంతంలో భారీ వాహనాలు కూరుకుపోయే ప్రమాదం ఉంది. మినీ ట్యాంక్‌బండ్ రోడ్డు మీదుగా నిత్యం వందలాది వాహనాలు సూర్యాపేట, తొర్రూరు, ఖమ్మం, ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటాయి.

నాణ్యతలేమి

పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు నాసిరంగా చేపట్టాడన్న విమర్శలున్నాయి. పనులను పర్యవేక్షించాల్సిన అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడలేదన్న స్థానికులు ఆరోపిస్తున్నారు. వెంటనే మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

భారీ వాహనాలను నియంత్రించాలి



ట్యాంక్‌బండ్ పైనుంచి భారీ లోడ్‌తో వెళ్లే వాహనాలను అనుమతించవద్దు. వేరే చోటనుంచి దారి మళ్లించాలి. ఇసుక లారీలను పూర్తిగా నిషేధించాలి. నాసిరకంగా పనులు చేపట్టిన కాంట్రాక్టర్ నుంచి నిధులు రికవరీ చేయాలి.

– బయ్యని రాజు, బీజేపీ పట్టణ అధ్యక్షుడు, మోత్కూరు

మరమ్మతులు చేపట్టాలి

ప్రమాదకరంగా మారిన మినీ ట్యాంక్‌బండ్‌కు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలి. కుంగిన రోడ్డు, ఫుట్‌పాత్‌ల స్థలాన్ని గుర్తించి పునర్ నిర్మాణం చేయాలి. నిర్మాణ పనులపై అధికారులు విచారణ చేయాలి.

– తీపిరెడ్డి సోమిరెడ్డి, లోక్‌సత్తా ఉద్యమ నాయకుడు, మోత్కూరు

కట్ట కుంగింది వాస్తవమే

మినీ ట్యాంక్‌బండ్‌పై బీటీ రోడ్డు కొంత మేర కుంగిన విషయం వాస్తవమే. కుంగిన ప్రాంతాన్ని పరిశీలించి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. కట్ట దెబ్బతినకుండా మరమ్మతులు చేపడుతాం.

– చంద్రశేఖర్, ఐబీ ఏఈ

ఓటు వేయడం బాధ్యత

ఆలేరురూరల్ : దేశ పౌరులుగా ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవడం మనందరి బాధ్యత అని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వీరారెడ్డి అన్నారు. శనివారం ఆలేరు తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులతో సమావేశమయ్యారు. ఓటరుగా నమోదు, ఓటు హక్కు సద్వినియోగం చేసుకోవడంపై ఓటర్లలో చైతన్యం తీసుకువచ్చేందుకు ప్రచార కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. అక్టోబర్ 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు. సీనియర్ సిటిజన్లు, దివ్యాంగులు ఓటు వేసేందుకు పోలింగ్ బూత్‌లలో ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఏఓలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉరేసుకుని మహిళ ఆత్మహత్య

గరిడేపల్లి : ఉరేసుకుని మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన గరిడేపలికల మండలం పానుగోడు గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. గరిడేపల్లి ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గరిడేపల్లి మండలం పానుగోడు గ్రామానికి చెందిన కంచర్ల మంజుల(39) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్నా నయం కాకపోవడంతో మనస్తాపానికి గురైంది. ఈ నేపథ్యంలోనే ఇంట్లోనే చీరతో ఉరివేసుకుంది. ఇరుగుపొరుగు వారు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో విషయం వెలుగులోకి వచ్చింది. మృతురాలికి ఇద్దరు అమ్మాయిలు ఉన్నారు. మృతురాలి తమ్ముడు బుసిరెడ్డి జనార్దన్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమెదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు.

నర్సరీ దగ్ధం

నార్కట్‌పల్లి : గుర్తుతెలియని వ్యక్తులు నర్సరీని దగ్ధం చేశారు. ఈ ఘటన నార్కట్‌పల్లి మండల పరిధిలోని ఎల్లారెడ్డిగూడెం గ్రామ శివారులో చోటు చేసుకుంది. భాదితుడు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గోపాల్‌రెడ్డి వద్ద మహమ్మద్ రెండు ఎకరాల భూమిని లీజుకు తీసుకుని కూరగాయల నారు పెంచుతున్నాడు. నర్సరీకి దాదాపు రూ. 30 లక్షల వరకు పెట్టుబడి పెట్టి మిర్చి, టమాటా, వంకాయ, బంతి నారు పెంచుతున్నాడు. రోజు మాదిరిగా గురువారం రాత్రి 8 గంటలకు నర్సరీ నుంచి వెళ్లి తిరిగి శుక్రవారం ఉదయం 6 గంటలకు వచ్చే సరికి నర్సరీ మొత్తం దగ్ధమైంది. సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించాఉ. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ నర్సిరెడ్డి తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో నలుగురిపై కేసు

మోత్కూరు : మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని చెరువు కట్ట వద్ద శనివారం సాయంత్రం స్థానిక పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న నలుగురు వ్యక్తులపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ ఏమిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

గాయపడిన వ్యక్తి మృతి



మణికంఠ (ఫైల్)

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : మఠంపల్లి మండలంలోని తుమ్మలతండాలో ఈ నెల 20వ తేదీన బాణసంచా కాలుస్తుండగా జరిగిన ప్రమాదంలో చింతలపాలెం మండలం పీక్లానాయక్ తండాకు చెందిన భూక్య మణికంఠ (25) గాయపడ్డాడు. అతనిని మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్ తరలించారు. వారం రోజులుగా అక్కడ చికిత్స పొందుతూ మణికంఠ శనివారం మృతి చెందారు. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

బాబోయ్.. దొంగలు!

- కోదాడలో నెల రోజుల వ్యవధిలోనే నాలుగు చోరీలు
- నిర్వహణ లేకపోవడంతో పనిచేయని సీసీ కెమెరాలు
- ఆందోళనకు గురవుతున్న కోదాడ పట్టణ వాసులు



కోదాడలో భవాని నగర్‌లో దొంగలు పడ్డ ఇల్లు

కోదాడ: కోదాడలో వరుసగా జరుగుతున్న దొంగతనాలతో ప్రజలు బేలెత్తిపోతున్నారు. పట్టణంలో దొంగలు నిత్యం సంచరిస్తూ తాళం వేసిన ఇళ్లనే టార్గెట్‌గా చేసుకొని చోరీలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. నెల రోజుల వ్యవధిలోనే వరుసగా నాలుగు దొంగతనాలు చోటు చేసుకోవడంతో పట్టణ ప్రజలకు తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. దొంగలు పగలే తుపాకులు పట్టుకొని చోరీలకు పాల్పడుతున్నా పోలీసులు చర్యలు తీసుకోలేకపోతున్నారనే విమర్శలు వస్తున్నాయి. దీనికితోడు గతంలో దాతల సాయంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల నిర్వహణను పట్టించుకోవడం లేదని, దీంతో పట్టణంలో ఏం జరిగినా చిన్న క్లూ కూడా దొరకని పరిస్థితి నెలకొందని పలువురు పేర్కొంటున్నారు. పోలీసులు రాత్రి పూట గస్తీని పెంచాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ఇటీవల జరిగిన చోరీ ఘటనలు..

- నెల రోజుల క్రితం నయానగర్‌లో నివాసముంటున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడి ఇంట్లో దొంగలు పడి 10 తులాల బంగారు ఆభరణాలను దోచుకెళ్లారు.
- పది రోజుల క్రితం గోపిరెడ్డినగర్‌లో నివాసం ఉండే మున్సిపల్ ఏఈ ఇంట్లో రాత్రి 10 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి 29 తులాల బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు.
- మూడు రోజుల క్రితం భవానినగర్‌లో నివాసముంటున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఇంట్లో సుమారు 30 తులాల బంగారు ఆభరణాలతో పాటు రూ.రెండు లక్షల నగదు చోరీకి గురయ్యాయి.

పూర్తి స్థాయి అధికారులు ఉన్నా..

కోదాడ పట్టణంలో గతంలో ఒక స్టేషన్, ఒక ఎస్ఐ మాత్రమే ఉండేవారు. కోదాడ పట్టణ ట్రాఫిక్‌తో పాటు దొంగతనాల విషయంలో నిత్యం నిఘాపెట్టేవారు. ఎస్ఐ స్థాయి అధికారి నిత్యం పట్టణంలో మోటార్‌సైకిల్ మీద సంచరించేవారు. ప్రస్తుతం పట్టణంలో టౌన్, రూరల్, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌తో పాటు డీఎస్పీ, రూరల్ సర్కిల్ కార్యాలయంతో పాటు పట్టణ స్టేషన్‌లో సీఐ స్థాయి అధికారి, ఇద్దరు ఎస్ఐలు, ట్రాఫిక్ ఎస్ఐ ఇలా పదుల సంఖ్యలో అధికారులు ఉన్నారు. కింది స్థాయి అధికారులు మినహా ఉన్నతాధికారులు స్టేషన్ దాటి బయటకు రాకపోవడంతో క్షేత్రస్థాయిలో ఏం జరుగుతుందో అర్థం కాని పరిస్థితి నెలకొంటుందని పట్టణ వాసులు పేర్కొంటున్నారు.

పట్టపగలే తుపాకులు పట్టుకుని

కోదాడ పట్టణంలో పది రోజుల క్రితం శ్రీమన్నారాయణ కాలనీలో పట్ట పగలు జరిగిన దొంగతనం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. కాలనీలో ఉదయం తాళం వేసిన ఇంట్లో దొంగలు ప్రవేశించారు. ఈ విషయాన్ని గమనించిన ఒకరు వారిని అడ్డుకొనే ప్రయత్నం చేయగా.. దొంగలు తుపాకీ చూపించి అతడి బెదిరించి అక్కడి నుంచి పరారయ్యారు. కాగా.. ఈ దొంగతనాల విషయంలో పోలీసులు శుక్రవారం సమావేశం ఏర్పాటు చేసి ప్రజలు జాగ్రత్తగా ఉండాలని చెప్పారు.

గస్తీ పెంచాం

కోదాడ పట్టణంలో దొంగతనాలు అరికట్టడానికి గస్తీని ముమ్మరం చేశాం. అదనపు సిబ్బందిని కూడా పిలిపించాం. ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. డీఎస్పీతో సహా అధికారులు అంతా పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు.

– రాము, కోదాడ పట్టణ సీఐ

గర్వంగా ఉంది..

- ఇస్రో శాస్త్రవేత్త కోటగిరి శ్రీలేఖ



నకిరేకల్ : దేశం గర్వించదగిన చంద్రయాన్ – 3 విజయవంతం అవడం, ఈ మిషన్ ప్రాజెక్ట్‌లో ఉండటం ఎంతో ఆనందంగా ఉందంటున్నారు.. నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలం చందుపట్ల గ్రామానికి చెందిన కోటగిరి శ్రీలేఖ. ఇస్రోలో టెస్టింగ్ అండ్ అనలిస్ట్ కంట్రోల్ ఎలక్ట్రానిక్స్ లాండర్స్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఆమె చంద్రయాన్–3 సక్సెస్‌ను శనివారం ఆమె 'సాక్షి'తో పంచుకున్నారు. వివరాలు ఆమె మాటల్లోనే.. ప్రపంచం చూపు ఇస్రో వైపు ఉంది. ఇలాంటప్పుడు నేను ఇస్రోలో వర్క్ చేస్తున్నందుకు గర్వంగా ఉంది. చేయబోయే పనులకు ఎంతో బూస్టింగ్‌గానూ ఉంది. నేను పుట్టి పెరిగింది నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలం చందుపట్ల గ్రామం. మా తల్లిదండ్రులు కోటగిరి శంకర్, కోటగిరి పద్మ. సూర్యాపేటలో 8వ తరగతి చదువుకున్నా. ఆ తర్వాత చదువురీత్యా మా అన్నయ్య, నన్ను హైదరాబాద్‌లోనే ఉంచారు. ఐఐటీ జెఈఈలో ర్యాంకు వచ్చాక, మా అన్నయ్య ఇచ్చిన గైడెన్స్‌తో స్పేస్ సైన్స్ తీసుకున్నా. అన్నయ్య టీచింగ్ ఫీల్డ్‌లో ఉండటం కూడా నాకు బాగా హెల్ప్ అయ్యింది. తిరువనంతపురంలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీలో చదువు పూర్తయ్యాక ఇస్రోలో జాబ్ వచ్చింది. ఈ పదేళ్లలో ఎన్నో మిషన్ ప్రాజెక్ట్స్‌లో భాగమయ్యాను. వర్క్ షెడ్యూల్స్ ప్రకారం టైమింగ్ గురించి అస్సలు బేరీజు వేసుకోవడం ఉండదు. అచీవ్‌మెంట్ వైపుగానూ దృష్టి ఉంటుంది. ఉద్యోగమూ, కుటుంబమూ రెండింటినీ బ్యాలెన్స్ చేసుకోవడం మన చేతుల్లోనే ఉంటుంది. నా వర్క్ షెడ్యూల్స్‌ని, మా ఐదేళ్ల అమ్మాయి పెంపకం విషయంలో బ్యాలెన్స్ మా కుటుంబం నుంచి ఉండే సపోర్ట్ నాకు పెద్ద బలం.

యాదాద్రిలో పవిత్రోత్సవాలకు అంకురార్పణ



తొలి పూజ నిర్వహిస్తున్న ఆచార్యులు



నవధాన్యాలకు పూజ చేస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో శనివారం సాయంత్రం శ్రీస్వామి వారి పవిత్రోత్సావాలకు ఆచార్యులు శ్రీకారం చు ట్టారు. యాదాద్రి ప్రధానాలయం ముఖ మండపంలో స్వస్తీ వాచనం జరిపించి, అంకురార్పణతో పవి త్రోత్సవాలను ఆగమ శాస్త్ర ప్రకారం ప్రారంభించా రు. ఉత్సవాలకు ఆధ్యుడైన విశ్వక్సేనుడికి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పీ ఠంపై మూడు ప్రధాన కలశాలను ఏర్పాటు చేసి గంగా జలంతో గర్భాలయం, పరిసరాలు, క్యూలైన్లతో పాటు ఆలయంలో వేద మంత్రాలు, భాజాభజంత్రీలు, మంగళవాయిద్యాలతో సంప్రోక్షణ గావించారు. అనంతరం ఆలయంలో ఏర్పాటు చేసిన యాగశాలలో అంకురార్పణ చేశారు. పుట్ట మట్టిని తెచ్చి వాటిలో నవ ధాన్యాలు, పంచామృతాలను పోసి వాటికి వేదమంత్రముగా పాలికల్లో పోసి ప్రత్యేక పూజలను చేపట్టారు. వేద మంత్రాలతో యాగశాలలో అగ్ని ప్రతిష్ట చేసి దేవతా మూలమంత్రాలతో హవనం నిర్వహించారు. వేద మంత్రాలతో ఆ దోషాలను పరిహారం చేయడమే పవిత్రోత్సవాల సంకల్పమని అర్చకులు తెలిపారు.

చోరీలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్

మిర్యాలగూడ అర్బన్: దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. వన్‌టౌన్ సీఐ రాఘవేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ పట్టణంలోని బైపాస్‌రోడ్డు వై జంక్షన్ వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో స్కూటీపై వస్తున్న వ్యక్తిని ఆపి వివరాలు అడుగుతుండగా పారిపోయేందుకు ప్రయత్నించడంతో అతడిని అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించగా గుంటూరు జిల్లా కేంద్రం శ్రీనివాసరావుపేట కు చెందిన పసుపులేటి సాయినాథ్ బాబు గా గుర్తించారు. కాగా సదరు వ్యక్తి నెల 24న పట్టణంలోని ముత్తిరెడ్డికుంటలో నడుచుకుంటూ వెళుతున్న ఓ మహిళ మెడలో 3తులాల బంగారు గొలుసును లాక్కొని పారిపోయినట్లు గుర్తించారు. అంతే కాకుండా గతంలో 2017 నుంచి ఇప్పటి వరకు నగరపాలెం, మేడికొండూరు, నల్లపాడు, మార్ధూరు పోలీస స్టేషన్ల పరిదిలో అనేక కేసులు నమోదయ్యాయని నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో రౌడీషీట్ కూడా ఉన్నట్లు గుర్తించారు. దీంతో అతడి వద్ద నుంచి బంగారు గొలుసును స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

కోతుల దాడిలో చిన్నారికి గాయాలు

భూదాన్‌పోచంపల్లి : కోతుల దాడిలో చిన్నారికి గాయాలైన సంఘటన శనివారం సాయంత్రం మున్సిపాలిటీ పరిధిలోని ప్రకాశ్‌నగర్‌లో జరిగింది. ప్రకాశ్‌నగర్‌కు చెందిన ఎక్కందేవి రామకృష్ణ, సంగీతల కుమార్తె రిషిక ఇంటి ఆరుబయట ఆడుకొంటుండగా అటుగా వచ్చిన కోతుల గుంపు చిన్నారిపై దాడి చేశాయి. ఈ దాడిలో చిన్నారికి మెడ, చెవి బాగాన గాయలయ్యాయి. భయపడిన చిన్నారి కేకలు వేయడంలో ఇంటి పక్కనే ఉన్న గర్దాస్ రామస్వామి కర్ర తీసుకొని బయటికి వచ్చి కోతులను తరిమి కొట్టాడు. గత కొద్దిరోజులుగా ప్రకాశ్‌నగర్, మార్కండేయనగర్‌లో కోతుల బెడదతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు వాపోయారు. అధికారులు స్పందించి కోతుల బెడద నుంచి రక్షించాలని పట్టణ ప్రజలంతా కోరుతున్నారు.

పేలిన గ్యాస్ సిలిండర్



మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

సూర్యాపేట క్రైం : పాత ఇనుప సామగ్రి దుకాణంలో గ్యాస్ సిలిండర్ పేలిన ఘటన శనివారం సూర్యాపేట పట్టణంలోని బొడ్రాయిబజార్‌లో చోటుచేసుకుంది. చల్లా వెంకన్న 30 సంవత్సరాలుగా బొడ్రాయిబజారులో పాత ఇనుప సామాను దుకాణం నిర్వహిస్తున్నాడు. ఇరుకు రోడ్డు కావడం.. ఉన్న కొద్దిపాటి స్థలంలోనే సామాన్లు వేయడంతో ఒత్తిడికి గురైన పాత గ్యాస్ సిలిండర్ పేలింది. గ్యాస్ సిలిండర్ పేలడంతో పెద్ద శబ్దం రావడంతో ఆ ప్రాంత వాసులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. దుకాణంలో ఎవరికి గాయాలు కాలేదు. ఫైర్ సిబ్బంది వచ్చి మంటలు ఆర్పారు.

డీసీఎంఎస్ చైర్మన్‌పై కేసు

సూర్యాపేట రూరల్ : భూమిని ఆక్రమించాడనే అభియోగం మేరకు డీసీఎంఎస్ చైర్మన్ వట్టె జానయ్యపై శనివారం సూర్యాపేట రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. గాంధీనగర్‌కు చెందిన ఉగ్గం బుచ్చిరాములుకు సర్వే నంబర్ 337, 338, 339లో 30గుంటల భూమిని ఆక్రమించి దౌర్జన్యంగా ఫంక్షన్‌హాల్ నిర్మిస్తుండగా ప్రశ్నిస్తే చంపుతామని బెదిరించాడని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. రామారాకి చెందిన పాలవరపు వేణుకు సంబంధించిన భూమిని కలుపుకొని దాడులకు పాల్పడ్డారని తెలిపారు. తుంగతుర్తికి యలగందుల సంజీవ వరూధిని నగర్‌లో రెండు ప్లాట్లు విక్రయించగా కొన్నాళ్ల తర్వాత ప్లాట్లు లేవని జానయ్య బెదిరించి కబ్జా చేసినట్లు ఫిర్యాదు చేశారని చెప్పారు. బాలెంల గ్రామానికి చెందిన వల్లెం శేఖర్, సూర్యాపేట పట్టణానికి చెందిన పెండెం కృష్ణలు చేసిన ఫిర్యాదు మేరకు జానయ్య యాదవ్‌పై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

అడ్డగూడూరు : పీడీఎస్ బియ్యం తరలిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు. మండల పరిధిలోని జానకిపురం గ్రామం శివారులో తుర్కపల్లి మండలం భీల్యా తండాకు చెందిన గుగులోతు శంకర్, చొల్లరామారం గ్రామ శివారులో రమేష్ బియ్యం రవాణా చేస్తుండగా 9.5క్వింటాళ్ల బియ్యాన్ని పట్టుకున్నట్లు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పురుగు మందుల దుకాణంపై కేసు

హుజూర్‌నగర్ : అనుమతులు, సరైన ధ్రువపత్రాలులేని పురుగు మందుల దుకాణంపై ఇటీవల వ్యవసాయ రెవెన్యూ అధికారులు దాడులు చేసి అక్రమ నిల్వలను సీజ్ చేసిన విషయం తెలిసిందే. దీనికి సంబంధించి పట్టణంలోని లక్ష్మీ సీడ్స్ దుకాణంపై పురుగు మందుల చట్టం 1968 ప్రకారం కేసు నమోదు చేసినట్లు ఏఓ స్వర్ణ శనివారం తెలిపారు.

వింత ఆకారంలో ఆవుదూడ జననం

అర్వపల్లి: వింత ఆకారంలో ఆవుదూడ జన్మించిన సంఘటన జాజిరెడ్డిగూడెం మండలం అడివెంలలో శనివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన చెరుకు లింగయ్య ఆవు శనివారం ఈనడానికి ఇబ్బంది పడుతుండగా అర్వపల్లి గోపాలమిత్ర కుంభం సురేందర్‌ను పిలిపించారు. సురేందర్ ఆవుకు వైద్యం చేసి సుఖ ప్రసవం చేసేలా చేశారు. అయితే ఈ ఆవుకు జన్మించిన మగ దూడ వింత ఆకారంలో ఉంది. ఆవు దూడకు మూతిముందు ఏనుగు పిల్లను పోలినవిధంగా తొండం ఆకారం, ఇతర అవయవాలు వింతగా ఉన్నాయి. కాగా ఈదూడ వెంటనే చనిపోయింది. ఈదూడ వయస్సు ఆరు నెలలు ఉంటుందని పుట్టాల్సిన సమయానికి ముందే జన్మించిందని సురేందర్ చెప్పారు. జన్యులోపం కారణంగానే ఇలా జరిగి ఉంటుందని తెలిపారు.

తెలంగాణ ద్రోహులకు కేసీఆర్ టికెట్లు ఇచ్చారు



మాట్లాడుతున్న మందుల సామేల్

శాలిగౌరారం: తెలంగాణ ద్రోహులకే సీఎం కేసీఆర్ ఎమ్మెల్యే టికెట్లు ఇచ్చారని రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ మందుల సామేల్ ఆరోపించారు. శనివారం శాలిగౌరారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు సీఎం కేసీఆర్ మాదిగలకు అన్యాయమే చేశారన్నారు. తుంగతుర్తి నియోజకవర్గంలో టీఆర్ఎస్ పార్టీ ఏర్పడిన నాటి నుంచి తాను క్రియాశీలకంగా పనిచేస్తే స్థానికేతరులకు టికెట్ కేటాయించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని ఓడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. తుంగతుర్తి నియోజకవర్గంలో బీఆర్ఎస్‌ను ఓడించేందుకు మాదిగలంతా ఒక్కతాటి పైకి రావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రమావత్ శంకర్‌నాయక్, దర్శనం కృష్ణమూర్తి, భూపతి వెంకటేశ్వర్లు, కూతాటి సోములు, పుల్లూరు దేవేందర్, పడాల రమేశ్, దేవరకొండ జయరాజు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదును సద్వినియోగం చేసుకోవాలి

- నల్లగొండ కలెక్టర్ ఆర్.వి కర్ణన్



కలెక్టర్‌ను సన్మానిస్తున్న సాయిబాబా ఆలయ కమిటీ సభ్యులు



హాలియాలో ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఆర్.వి కర్ణన్

హాలియా : 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఆర్.వి కర్ణన్ అన్నారు. ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా హాలియా పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఓటరు నమోదు శిబిరాలను కలెక్టర్ కర్ణన్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓటరు నమోదు దరఖాస్తులు ఎన్ని వచ్చాయి. ఓటర్ జాబితాలో దివ్యాంగ ఓటర్ల గురించి తెలుసుకొని గరుడ యాప్‌లో నమోదు చేశారా అని బీఎల్ఓలను అడిగి తెలుసుకున్నారు. హాలియా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఓటరు నమోదుకు వచ్చిన 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులతో కలెక్టర్ మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రెండవ ప్రత్యేక ఓటరు జాబితా సవరణ 2023 కార్యక్రమంలో భాగంగా ఈనెల 26, 27వ తేదీలు, సెప్టెంబర్ 2, 3వ తేదీల్లో జిల్లాలోని అన్ని పోలింగ్ బూత్‌లలో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట హాలియా తహసీల్దార్ జయశ్రీ, బీఎల్ఓ అధికారులు తదితరులు ఉన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

చింతపల్లి : అక్టోబర్ 1, 2023 నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని నల్లగొండ కలెక్టర్ ఆర్వి.కర్ణన్ అన్నారు. ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా చింతపల్లి మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లో జరుగుతున్న ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలను ఆయన సందర్శించి మాట్లాడారు. ఓటరు జాబితాలో సవరణ, మార్పులు, చేర్పులు చేసుకునే కార్యక్రమం ఉంటుందని, బూత్ లెవల్ అధికారులు తమ పోలింగ్ కేంద్రాలలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అందుబాటులో ఉంటూ ప్రజలకు కావాల్సిన సమాచారం ఇవ్వాలని అన్నారు. గ్రామంలో మృతి చెందిన ఓటర్లను గుర్తించి తొలగించాలన్నారు. క్షేత్రస్థాయిలో ఓటరు నమోదుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీరాములు తహసీల్దార్ శంషొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

సాయి మందిరంలో కలెక్టర్ పూజలు

చింతపల్లి మండల కేంద్రంలోని షిర్డీ సాయినాథుని దేవాలయంలో నల్లగొండ కలెక్టర్ ఆర్వి.కర్ణన్ శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మంచికంటి ధనుంజయ్య, ప్రధాన కార్యదర్శి కొమిరిశెట్టి వెంకటయ్య, ఊరె కృష్ణయ్య, తడకమళ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన

కొండమల్లేపల్లి : అక్టోబర్ 1, 2023 నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని నల్లగొండ కలెక్టర్ ఆర్.వి.కర్ణన్ అన్నారు. ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా శనివారం కొండమల్లేపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లను ఆయన పరిశీలించి ఓటరు నమోదు ప్రక్రియను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపిపి శ్రీధర్‌రెడ్డి, హెచ్ఎం మంద సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పర్యావరణ సమతుల్యతను కాపాడాలి

కేతేపల్లి : రైతులు తమ పొలం గట్లపై మొక్కలు నాటుకుని పర్యావరణ సమతుల్యతను కాపాడాలని నల్లగొండ జిల్లా వ్యవసాయ అధికారిణి(డీఏఓ) వై.సుచరిత సూచించారు. హరితహారంలో భాగంగా శనివారం కేతేపల్లి మండలంలోని ఉప్పలపహాడ్ గ్రామంలో ఆమె పొలం గట్లపై రైతులతో కలసి మునగ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులంతా పొలం గట్లపై అనుకూలమైన టేకు, మునగ మొక్కలను నాటుకోవాలని సూచించారు. అనంతరం కేతేపల్లిలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాన్ని తనిఖీ చేశారు.

దారికాచి.. కళ్లలో కారం కొట్టి..

- రూ.3.20లక్షలు దోపిడీ

నేరేడుచర్ల : గుర్తుతెలియని వ్యక్తులు దారికాచి కళ్లలో కారం కొట్టి రూ.3.20లక్షలు దోపిడీ చేశారు. ఈ ఘటన నేరేడుచర్ల మండల పరిధిలోని దిర్శించర్ల గ్రామ శివారులో శనివారం రాత్రి చోటు చేసుకుంది. పాలకీడు, జాన్‌పహాడ్‌లలోని వైన్స్‌లలో వచ్చిన కలెక్షన్లు తీసుకొని ఆయా షాపుల్లో పనిచేస్తున్న నేరేడుచర్ల పట్టణానికి చెందిన కట్ట సుధాకర్‌రెడ్డి, బొలిశెట్టి శ్రీనులు బైక్‌పై నేరేడుచర్లకు బయలుదేరారు. నేరేడుచర్ల మండలం దిర్శించర్ల గ్రామ శివారులో గల సబ్ స్టేషన్ వద్దకు రాగానే సుధాకర్ రెడ్డి, శ్రీనులు ఇరువురు కలిసి వస్తున్న ద్విచక్రవాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు వెనుక నుంచి వచ్చి వాహనంతో ఢీకొట్టడంతో కిందపడిపోయారు. వెంటనే వారి కళ్లల్లో కారం కొట్టి పురుషపదాజాలంతో దూషిస్తూ వారి డిక్కీని పగులకొట్టి అందులో ఉన్న రూ.3.20లక్షలను దోపిడీ చేశారు. ఈ విషయంపై నేరేడుచర్ల పోలీస్ స్టేషన్‌లో సుధాకర్‌రెడ్డి, శ్రీనులు ఫిర్యాదు చేయగా ఎస్ఐ పరమేష్ కోదాడ డీఎస్పీ ప్రకాశ్, హుజూర్‌నగర్ సీఐ రామలింగారెడ్డిలకు సమాచారం అందించడంతో వారు సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.

ముప్పై ఏళ్లుగా గుడిసెలో నివాసం

- శిథిలావస్థకు చేరిన పూరి గుడిసె
- తల్లీకొడుకు ఇద్దరూ దివ్యాంగులే
- ఆసరా పింఛన్‌తోనే జీవనాధారం
- గృహలక్ష్మి పథకం వర్తింపచేయాలని వేడుకోలు



మానసిక దివ్యాంగుడైన కుమారుడితో రాంబాయమ్మ

మునగాల(కోదాడ): తల్లీ కుమారుడు ఇద్దరూ దివ్యాంగులే. వచ్చే ఆసరా పింఛన్ డబ్బులతో జీవనం సాగిస్తున్నారు. గత 30 ఏళ్లుగా పూరిగుడిసెలోనే ఉంటున్నారు. ప్రస్తుతం అది కూడా శిథిలావస్థకు చేరుకొని కూలేందుకు సిద్ధంగా ఉంది. తమకు గృహలక్ష్మి పథకం వర్తింపజేయాలని వేడుకుంటున్నారు. మునగాల మండల కేంద్రానికి చెందిన వెగ్గళం రాంబాయమ్మ(65)కు కుమారుడు, కుమార్తె ఉన్నారు. 32ఏళ్ల క్రితం ఈమె భర్త మృతిచెందాడు. కుమారుడు వెంకటేశ్వర్లు పుట్టుకతోనే మానసిక వికలాంగుడు. కుమార్తెకు వివాహం చేసి అత్తవారింటికి పంపింది. కూలీనాలీ చేసుకొని వికలాంగుడైన కుమారుడుని పోషిస్తూ పూరిగుడిసెలోనే జీవనం సాగిస్తోంది. కాగా రాంబాయమ్మ ఫైలేరియా బారిన పడి నడవలేని స్థితికి చేరుకోవడంతో వికలాంగుల కోటా కింద ఆసరా పింఛన్ మంజూరైంది. దాదాపు 30ఏళ్ల క్రితం ఏర్పాటు చేసుకున్న పూరిగుడిసె ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది. వర్షమొస్తే ఇద్దరు జాగారం చేయాల్సిందే. ప్రభుత్వం నుంచి వచ్చే పింఛన్ డబ్బులు రోగాలు, మందులకే సరిపోవడంతో జీవనం మరింత దుర్భరంగా మారింది. ఒకపూట తిని, ఒకపూట పస్తులుండాల్సిన దుస్థితి నెలకొంది.

పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు..

తల్లీ, కుమారుడి దుస్థితి గురించి ప్రజాప్రతినిధులు, అధికారులెవరూ పట్టించుకున్న పాపాన పోలేదు. ఎన్నికల సమయంలో వచ్చి తమకు ఓటేస్తే అన్ని ఇస్తాం అని మాయమాటలు చెప్పి, ఆ తర్వాత మొఖం చాటేస్తున్నారని వారు పేర్కొంటున్నారు. ప్రభుత్వం మంజూరు చేసే డబుల్ బెడ్ రూం ఇంటి కోసం దరఖాస్తు చేస్తే ఓ రాజకీయ నాయకుడు నీకు రాదులే అని మాట్లాడాడని వాపోయింది. బీసీ రుణం కోసం దరఖాస్తు చేసుకుంటే రాజకీయ అండదండలు లేకపోవడంతో అదీ చేజారి పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం నిలువనీడ లేక అల్లాడుతున్న తమకు సుమారు 180 గజాల సొంత స్థలం ఉన్నందున గృహలక్ష్మి పథకం వర్తింపచేయాలని తల్లీకుమారుడు కోరుతున్నారు.

గృహలక్ష్మి పథకం వర్తింపచేయాలి



నివాసముంటున్న పూరిగుడిసె శిథిలావస్థకు చేరుకుంది. వర్షం వస్తే తడిసిపోతున్నాం. మానసిక వికలాంగుడైన కుమారుడిని సాదుకుంటూ జీవనం వెళ్లదీస్తున్నాను. ప్రభుత్వం మాకు గృహలక్ష్మి పథకం వర్తింపచేస్తే కనీసం ఉండేందుకు ఓ ఇల్లు నిలబడుతుంది.

– వెగ్గళం రాంబాయమ్మ, మునగాల